# మంత్రి శ్రీధర్‌బాబుకు చుక్కెదురు

- క్రిమినల్ కేసులో పేరు తొలగింపునకు హైకోర్టు నిరాకణ
- విచారణ ఎదుర్కోవాల్సిందేనని న్యాయమూర్తి స్పష్టీకరణ



హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా అధికారుల విధులకు ఆటంకం కలిగించారన్న క్రిమినల్ కేసులో కాంగ్రెస్ నేత, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు చుక్కెదురైంది. ఆ కేసు నుంచి తన పేరును తొలగించాలన్న శ్రీధర్‌బాబు విన్నపాన్ని హైకోర్టు తోసిపుచ్చింది. తీవ్రమైన అభియోగాలతో నమోదైన ఆ కేసులో విచారణ ఎదుర్కొనాల్సిందే నని ఆయనకు తేల్చి చెప్పింది. అయితే, ఆ విచారణ కోసం ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరు కాకుండా ఉండేందుకు మినహాయింపు కల్పించింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను జనవరి 8కి వాయిదా వేశారు. వివరాల్లోకి వెళ్తే.. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో శ్రీధర్‌బాబు ప్రజలతో కలిసి నిరసన పేరిట నాటి సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతోపాటు కుర్చీలను విరగ్గొట్టి అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై 2017 ఆగస్టు 23న పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ పోలీసు స్టేషన్‌లో శ్రీధర్‌బాబుతోపాటు 300 మందిపై కేసు నమోదైంది. ఆ తర్వాత ఆ కేసు హైదరాబాద్‌లోని ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ కావడంతో తనపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని, ఆ కేసు నుంచి తన పేరును తొలగించాలని కోరుతూ శ్రీధర్‌బాబు డిశ్చార్జి పిటిషన్ వేశారు. ఈ ఏడాది నవంబర్ 22న ప్రజాప్రతినిధుల కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. దీన్ని సవాలు చేస్తూ శ్రీధర్‌బాబు హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు పూకావడంతో జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం తీర్పు వెలువరించారు.

## కౌశిక్‌రెడ్డి ఫోన్‌ను వాపస్ ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ వద్ద ఇటీవల ఓ కేసు విచారణలో భాగంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నుంచి స్వాధీనం చేసుకున్న ఐఫోన్‌ను తిరిగి ఇవ్వాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. నిందితుల నుంచి ఫోన్లను స్వాధీనం చేసుకునేటప్పుడు చట్టపరమైన నిబంధనలను అమలు చేయాలని స్పష్టంచేసింది. కౌశిక్‌రెడ్డి నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నప్పుడు పోలీసులు నిబంధనలను అనుసరించలేదని తప్పుపట్టింది. పోలీసుల చర్యలు బీఎన్‌ఎస్‌ఎస్‌లోని 105, 106 సెక్షన్లకు వ్యతిరేకంగా ఉన్నాయని ఆక్షేపించింది. కౌశిక్‌రెడ్డి ఐఫోన్‌ను తక్షణమే తిరిగి ఇచ్చేయాలని పోలీసులకు స్పష్టం చేసింది.

## 16మందికి ఎస్పీలుగా పదోన్నతి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 16 మంది అదనపు ఎస్పీలకు ఎస్పీలుగా పదోన్నతి, పోస్టింగ్ కల్పిస్తూ హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇదే ఉత్తర్వుల్లో ముగ్గురు డీసీపీలను బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. అందులో ఒకరిని డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఇక ఏఆర్ వ్యవస్థలో కొత్తగా రూపొందించిన ఏడు పోస్టుల్లోని అడిషనల్ ఎస్పీలకు ఎస్పీ హోదా ఇస్తూ బదిలీ చేశారు.

## ● 'పియస్టెవా' శిఖరంపై జగిత్యాల వాసి సూర్యనమస్కారాలు



*జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్లకు చెందిన మరిపెల్లి ప్రవీణ్ ఈ నెల 15న అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ఫినిక్స్ నగర శివారులోగల 'పియస్టెవా' శిఖరాన్ని అధిరోహించి 108 సూర్యనమస్కారాలు చేశాడు. ఇప్పటి వరకు ప్రవీణ్ 48 పర్వతాలను అధిరోహించి 108 సూర్య నమస్కారాలను ప్రదర్శించడం విశేషం.* *- మెట్‌పల్లి రూరల్*

# చలి @ 6 డిగ్రీలు

- ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- 27 జిల్లాల్లో రికార్డుస్థాయిలో నమోదు: వాతావరణ శాఖ

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తేతెలంగాణ)/భీంపూర్: రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. 27 జిల్లాల్లో సింగిల్ డిజిట్ నమోదైంది. ఇక ఆరు జిల్లాల్లో 13 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా చాలా గ్రామాలను పొగమంచు కప్పేసింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. ఫలితంగా రానున్న రెండు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టి)లో 6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ చలికాలం అర్లి(టి)లో రాష్ట్రంలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇది ఐదోసారి. హైదరాబాద్‌లో గరిష్టంగా 29 డిగ్రీలు, కనిష్ఠంగా 12 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.



## కేతన్ డబుల్ ధమాకా

**అండర్-14 క్రికెట్‌లో 235 పరుగులు**

జడ్చర్ల, డిసెంబర్ 16: అండర్-14 బాలుర వన్డే నాకౌట్ క్రికెట్ టోర్నీలో గున్న కేతన్‌కుమార్ యాదవ్ సత్తాచాటాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో సోమవారం సెయింట్ ఆంటోనీ హైస్కూల్‌తో జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ బ్యాటర్ కేతన్ డబుల్ సెంచరీ(136 బంతుల్లో 235, 26ఫోర్లు, సిక్స్)తో కదంతొక్కాడు. కెప్టెన్ కేతన్ ద్విశతకం ధాటికి మహబూబ్‌నగర్ 47 ఓవర్లలో 468/3 భారీ స్కోరు సాధించింది. కేతన్‌తో పాటు శ్రీహర్షిత్(75 నాటౌట్), ఆకారం హర్షిత్(62), సాయిరాం(32), మాలిమ్ అర్హన్(30) రాణించగా, 34 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చాయి. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఆంటోనీ హైస్కూల్..మహబూబ్‌నగర్ బౌలర్ల ధాటికి 11.1 ఓవర్లలో కేవలం 23 పరుగులకే కుప్పకూలి 445 పరుగుల తేడాతో భారీ ఓటమి మూటగట్టుకుంది. ఇందులో 8 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలోనే రాగా, బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. సోహైల్ 7 వికెట్లతో విజృంభించాడు.కేతన్ ప్రస్తుతం జడ్చర్ల స్వామి నారాయణ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.





## ఒడిశా రన్నరప్ తరుణ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భువనేశ్వర్ వేదికగా జరిగిన ఒడిశా మాస్టర్స్ సూపర్-100 టోర్నీలో తెలంగాణ యువ షట్లర్ మన్నెపల్లి తరుణ్ రన్నరప్‌గా నిలిచాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో తరుణ్ 18-21, 16-21 తేడాతో రిత్విక్ సంజీవి చేతిలో ఓటమిపాలయ్యాడు.

# భారత్ ఎదురీత

**తొలి ఇన్నింగ్స్ 51/4 ● బుమ్రా ఆరు వికెట్లతో అదుర్స్ ● ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 445 ఆలౌట్**







బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో కీలమైన మూడో టెస్టులో ఆస్ట్రేలియా, భారత్ ఆసక్తికర పోరును వరుణుడు నీడలా వెంటాడుతున్నాడు. మూడో రోజు సోమవారం పలుమార్లు వర్షం అంతరాయం కల్గించడంతో పూర్తి ఆట సాధ్యపడలేదు. వర్షాభావ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకున్న ఆస్ట్రేలియా..భారత్‌పై ఒత్తిడి అంతకంతకు పెంచేందుకు ప్రయత్నించింది. పలుమార్ల అంతరాయం తర్వాత ఆట ముగిసే సరికి టీమ్‌ఇండియా 4 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(33 నాటౌట్), కెప్టెన్ రోహిత్‌శర్మ(0 నాటౌట్) క్రీజులో ఉన్నారు. యశస్వి జైస్వాల్(4), గిల్(1), కోహ్లీ(3), పంత్(9) ఘోరంగా విఫలమయ్యారు. స్టార్క్(2/25) రెండు వికెట్లతో రాణించగా, కమిన్స్(1/7), హాజిల్‌వుడ్(1/17) ఒక్కో వికెట్ తీశారు. చేతిలో 6 వికెట్లు ఉన్న టీమ్‌ఇండియా ప్రస్తుతం 394 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది. ఈ మ్యాచ్‌లో కనీసం 246 పరుగులు చేస్తే తప్పా..భారత్ ఫాలోఆన్ తప్పించుకోలేదు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 405/7తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ 445 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ అలెక్స్ క్యారీ(70) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. బుమ్రా(6/76) ఆరు వికెట్లతో విజృంభించగా, సిరాజ్‌కు రెండు ఆకాశ్‌దీప్, నితీశ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ సిరీస్‌లో ఆరు వికెట్ల ప్రదర్శన కనబర్చడం బుమ్రాకు ఇది రెండోసారి. ఈ క్రమంలో ఆసీస్ గడ్డపై 50 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.

**బ్యాటింగ్ ఢమాల్:**

గబ్బా పిచ్‌పై ఆసీస్ బ్యాటర్లు పోరాట పటిమ కనబర్చిన చోట భారత బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. ఆసీస్ పేస్ త్రయం స్టార్క్, హాజిల్‌వుడ్, కమిన్స్ పదునైన పేస్ ధాటికి టీమ్‌ఇండియా 44 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. స్టార్క్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ రెండో బంతికి జైస్వాల్..మార్ష్‌కు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత మూడో ఓవర్‌లో స్టార్క్ ఔట్‌సైడ్ ఆఫ్‌సైడ్ బంతిని ఆడిన గిల్..మార్ష్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. భారీ ఆశలు పెట్టుకున్న కోహ్లీ మరో మారు ఉసూరుమనిపించాడు. హాజిల్‌వుడ్ ఊరించే బంతిని డ్రైవ్ ఆడబోయిన కోహ్లీ.. కీపర్ క్యారీకి క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. పలుమార్లు వర్షం అంతరాయంతో ఏకాగ్రత దెబ్బతిన్న పంత్..కమిన్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అంతోఇంతో రాహుల్ మినహా ఎవరూ చెప్పుకోదగ్గ ఆటతీరు కనబర్చలేదు.

**సంక్షిప్త స్కోర్లు**

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445 ఆలౌట్(హెడ్ 152, స్మిత్ 101, బుమ్రా 6/76, సిరాజ్ 2/97), భారత్ తొలి ఇన్నింగ్స్: 51/4(రాహుల్ 33 నాటౌట్, పంత్ 9, స్టార్క్ 2/25, కమిన్స్ 1/7)

# విజేత ఉస్మానియా

- ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆల్‌ఇండియా మహిళల ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ టోర్నీలో ఉస్మానియా యూనివర్సిటీ జట్టు టైటిల్‌తో మెరిసింది. సోమవారం మణిపాల్ యూనివర్సిటీ వేదికగా జరిగిన ఫైనల్లో ఓయూ 2-1తో మద్రాస్ యూనివర్సిటీపై విజయం సాధించింది. తొలుత జరిగిన సింగిల్స్‌లో శ్రీమన్యరెడ్డి 6-2, 0-6, 3-6తో లక్ష్మి ప్రభ చేతిలో ఓడింది. మరో సింగిల్స్‌లో సామా చెవికారెడ్డి 6-2, 6-4తో అభిజ్ఞపై గెలిచింది. డబుల్స్‌లో ఓయూ ద్వయం సౌమ్య, చెవికారెడ్డి 12-10, 6-2తో లక్ష్మి ప్రభ, అనన్యపై గెలిచి ట్రోఫీ కైవసం చేసుకున్నారు. ఇటీవల జరిగిన సౌత్‌జోన్ టోర్నీతో పాటు ఆల్ ఇండియా టోర్నీలో ఓయూ ప్లేయర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు.

## విలియమ్సన్ సెంచరీ



హామిల్టన్(న్యూజిలాండ్): ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టుపై న్యూజిలాండ్ మరింత పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 136/3తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్ 453 పరుగులకు ఆలౌటైంది. స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్(156) సెంచరీతో కదంతొక్కగా, మిచెల్(60) ఆకట్టుకున్నాడు. ఇంగ్లండ్ బౌలర్లను ఉతికిఆరేస్తూ విలియమ్సన్ టెస్టుల్లో 33వ సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. 658 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ ఆట ముగిసే సరికి 18 పరుగులకు 2 వికెట్లు కోల్పోయింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.